ప్రజాశక్తి

మంగళవారం 28 జనవరి 2025

5

పార్వతీపురం మన్యం



గురుకుల విద్యార్థిపై యాసిడ్ దాడి

సాలూరు: పట్టణంలోని పిఎన్ బొడ్డవలసలో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 8 తరగతి విద్యార్థి చింతగడ చైతన్యపై మరో విద్యార్థి యాసిడ్ లాంటి ద్రవం పోశాడు. దీంతో చైతన్య మర్మాంగం పై పొక్కులొచ్చి గాయాలయ్యాయి. ఆదివారం అర్ధరాత్రి సమయంలో చైతన్యపై మరో విద్యార్థి బాత్ రూమ్ క్లీనింగ్ చేసే యాసిడ్ లాంటి ద్రవం పోయడంతో ఆయన అస్వస్థతకు గురయ్యాడు. పట్టణంలోని పెద్ద వీధికి చెందిన చింతగడ యమున కుమారుడైన చైతన్యను ప్రయివేటు ఆసుపత్రి కి తీసుకెళ్ళి చికిత్స చేయించారు.కానీ పాఠశాల ప్రిన్సిపాల్ ఆశీర్వాదం మాత్రం గాయపడిన విద్యార్థిని ఆసుపత్రికి తీసుకెళ్ళ లేదు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు ప్రిన్సిపల్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల యోగక్షేమాలు చూడాల్సిన ప్రిన్సిపల్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని బంధువులు తెలిపారు.



ఘనంగా తొలేళ్ల ఉత్సవం

- అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్ దంపతులు
- నేడు సిరిమానోత్సం.. ఏర్పాట్లు పూర్తి
- బందోబస్తు పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి - మక్కువ

శంబర పోలమాంబ అమ్మవారి జాతరలో భాగంగా సోమవారం తొలేళ్ల ఉత్సవం ఘనంగా జరిగింది. ఉత్సవంలో రైతులు పండించిన పంటను (ధాన్యం) అమ్మవారి గుడికి తెచ్చి రాశులుగా పోశారు. పూజారితోకలిసి ఘటాలు మోసే భక్తులు ఆ ధాన్యాన్ని కలియతొక్కారు. అనంతరం వాటిని రైతులు ఇళ్లకు తీసుకెళ్లి ధాన్యపు రాశుల్లో దాచుకొని, ఖరీఫ్‌లో పొలాల్లో చల్లుకోవడం ఆనవాయితీగా వస్తుంది. జిల్లా కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ కుటుంబ సమేతంగా అమ్మవారిని సోమవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ కార్య నిర్వాహక అధికారి వివి సూర్యనారాయణ స్వాగతం పలికి దగ్గరుండి దర్శన ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో భక్తులకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని సూచించారు. అనంతరం అమ్మవారి ఘటాలకు కలెక్టర్ కుటుంబం పూజలు చేశారు.

మంగళవారం సిరిమానోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు చేశారు.ఉత్సవ కమిటీ చైర్మన్ నైదాన తిరుపతిరావు దగ్గరుండి పనులు పూర్తి చేయించారు. ఈ ఏడాది సినిమానును పూజారి జన్ని పేకాపు రామారావు అధిరోహించనున్నారు. సిరిమానోత్సవానికి తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి వేలాది మంది తరలిరానున్నారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చదురు గుడి వద్ద భారీ క్యూలైన్‌లను ఏర్పాటు చేశారు.

పటిష్ట పోలీసు బందోబస్తు

అడిషనల్ ఎస్‌పి దిలీప్ కిరణ్ పర్యవేక్షణలో సినిమాను తిరిగే తిరిగే ప్రాంతాల్లో 700 మందితో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. సిరిమాను తిరిగే ప్రదేశంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు ఉన్నతాధికారులు రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి డ్రోన్ కెమెరాలతో పాటు సిసి కెమెరాల పర్యవేక్షణ కూడా చేపట్టనున్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో పోలీస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు

150 మంది పారిశుధ్య కార్మికులు

జాతర సందర్భంగా అపారిశుధ్యాన్ని నిరోధించేందుకు 150మంది పారిశుధ్య కార్మికులను వినియోగించనున్నట్లు ఎంపిడిఒ స్వరూపరాణి తెలిపారు వీరందరికీ మండలంలోని గ్రామ కార్యదర్శులు, ఇతర సచివాలయ సిబ్బందిని ఇఒపిఆర్‌డి దేవకుమార్ పర్యవేక్షించనున్నారని ఆమె తెలిపారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో ఆరుచోట్ల ప్రత్యేక ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామని తెలిపారు.

రూ.12 లక్షల నిధులతో 9 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు

జాతరలో విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టినట్లు డిఇ గోపాలరావు తెలిపారు. రూ. 12 లక్షలు వెచ్చించి 9 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన జాతరకు వచ్చే భక్తులకు వైద్య సదుపాయాలు కల్పించేందుకు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. శంబర పిహెచ్‌సి వైద్యాధికారి ఎంవి కిరణ్‌కుమార్ తెలిపారు. జాతరలో అగ్నిమాపక సిబ్బంది కూడా ఎటువంటి ప్రమాదాలకూ తావు లేకుండా పటిష్ట చర్యలను చేపడుతున్నారు.

బందోబస్తు ఏర్పాట్లును ఎస్‌పి పరిశీలన

శంబర పోలమాంబ అమ్మవారి జాతర సందర్భంగా శంబరను ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి సోమవారం సాయంత్రం పర్యవేక్షించారు. సిరిమాను తిరిగే ప్రాంతాలను, ఆలయ పరిసర ప్రాంతాలు, అలాగే క్యూలైన్లు, బారికేడ్స్ ఏర్పాట్లును, పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ మోనటరింగ్ తదిర ఏర్పాట్లును ఎస్పీ, ఇతర పోలీసు అధికారులు సందర్శించారు. సిరిమాను, పూజారి తరలింపులో ఎటువంటి ఆలస్యం లేకుండా చూడాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో బందోబస్తు నిర్వహించే అధికారులు, సిబ్బంది విధులను అడిగి తెలుసుకొని పరిశీలించారు. షిఫ్ట్ డ్యూటీలకు హాజరయ్యే అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. అమ్మవారి దర్శనం కోసం ఆలయం వెనుక భాగం నుంచి ఎవర్నీ, ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించొద్దని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎఎస్‌పిలు ఒ.దిలీప్ కిరణ్, అంకిత సురానా, ఎఆర్ డిఎస్‌పి థామస్ రెడ్డి, ఎస్‌బి సిఐ రంగనాథం, సాలూరు రూరల్ సర్కిల్ సిఐ రామకృష్ణ, పలువురు సిఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



పోలమాంబకు ప్రత్యేక పూజలు చేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ దంపతులు



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్‌పి మాధవరెడ్డి



సిరిమానును సిద్ధం చేస్తున్న గ్రామస్తులు

'పిఎం సూర్యఘర్'పై ప్రచారం చేయాలి

- రక్తహీనత నివారణకు కృషి చేయాలి
- శంబర జాతరలో లోటుపాట్లు ఉండరాదు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

పిఎం సూర్యఘర్ పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించి ప్రతి ఒక్కరూ వినియోగించుకొనేలా చూడాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో సంబంధిత జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇంటి అవసరాలకు అవసరమైన విద్యుత్‌ను వినియోగించుకుంటూ మిగులు విద్యుత్ ద్వారా అదనపు ఆదాయం సమకూరుతుందన్న విషయాన్ని ప్రజలకు వివరించాలని అన్నారు. సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకుంటున్న లబ్ధిదారుని ఇంటిని సందర్శించి, లబ్ధిదారుడు ద్వారా ప్రభుత్వం నుంచి పొందే లబ్ధిపై ప్రజలకు తెలిసేలా వివరించాలని కలెక్టర్ సూచించారు. తద్వారా ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లాలో రక్తహీనత నివారణకు చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని, దీన్ని ఇంకా బాగా చేసి లక్ష్యాన్ని సాధించేందుకు మరింత కృషి చేయాలన్నారు. రక్తహీనత కలిగిన వారిని గుర్తించి, ప్రభుత్వం అందిస్తున్న టిహెచ్‌ఆర్‌తో పాటు జిల్లా యంత్రాంగం తరపున అందించే అదనపు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని తీసుకునేలా చూడాలని ఆదేశించారు. ప్రతి నెలా రక్తంశాతం పెరగాలని, ఆ దిశగా చర్యలు తీసుకొని రక్తహీనత నివారణ జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

శంబర జాతరలో ఎటువంటి లోటుపాట్లు ఉండరాదు

సోమవారం నుంచి శంబర జాతర ప్రారంభమైన నేపథ్యంలో మంగళ, బుధవారాల్లో భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. కావున జిల్లా అధికారులు వారికి అప్పగించిన విధులను బాధ్యతతో నిర్వహించి, ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో డిఆర్‌ఒ కె.హేమలత, కెఆర్‌ఆర్సి ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, ఏపీ ఈపిడిసిఎల్ ఎస్‌ఇ కె.చలపతిరావు, డిఎంహెచ్‌ఒ ఎస్.భాస్కరరావు, జిల్లా పరిశ్రమల అధికారి ఎంవి కరుణాకర్, జిల్లా ఆర్.డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ ఒ.ప్రభాకరరావు, డిపిఐఆర్‌ఒ ఎల్.రమేష్, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల హాస్టళ్లలో సమస్యల్లేకుండా చేస్తా : మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

గిరి శిఖర గ్రామాల నుంచి వచ్చే గర్భిణులకు వైటిసి వసతి గృహంలో ఎటువంటి సమస్యల్లేకుండా చూస్తానని స్త్రీ, శిశు, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సోమవారం స్థానిక వైటిసిని ఆమె సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిరిశిఖర గ్రామాల నుంచి ఇక్కడికి ప్రసవాల కోసం వచ్చే ప్రతి తల్లికి ప్రభుత్వం అన్ని వసతులు సమకూరుస్తుందన్నారు. ఇంకా ఎటువంటి సమస్యలున్నా తమకు తెలియజేస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకొంటామని తెలిపారు. వైటిసి సిబ్బందితో మాట్లాడుతూ మంచినీటి సదుపాయం కోసం ఆర్‌ఒ ప్లాంట్‌ను వెంటనే రిపేర్ చేయించాలని, ఇక్కడికి వచ్చే ఏ ఒక్క గర్భిణీకి ఇబ్బందుల్లేకుండా చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆమెతో మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగాఅతి తక్కువ జీతాలకు పని చేస్తున్నామని, అది కూడా సక్రమంగా రావట్లేదని, మీరైనా స్పందించి తమకు నెలనెలా జీతాలు వచ్చేలా కృషి చేయాలని కోరారు. దీనికి స్పందించిన ఆమె వెంటనే ఎప్పటికప్పుడు జీతాలు వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైటిసి సిబ్బంది, మండల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేశ్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీతంపేట గ్రామ గిరిజనులు

గిరిజనులకు పట్టాలు మంజూరు చేయాలి

కలెక్టరేట్ వద్ద గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని సంగంవలస పంచాయతీ సీతంపేటకు చెందిన గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట గిరిజనులతో కలిసి ధర్నా నిర్వహించి, అనంతరం కలెక్టర్‌కు వినతి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతంపేట గ్రామస్తులు 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న ప్రభుత్వ బంజరు భూమికి అప్పట్లో పట్టాల కోసం దరఖాస్తు చేసుకోగా ఆర్వోఆర్ పట్టాలు మంజూరు చేశారని, వాటిని డి-పట్టాలుగా మార్చి ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాలకు అర్హులుగా చేయాలని కోరుతున్నప్పటికీ అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఈ విషయమై అటవీశాఖ అధికారులు కూడా తమకు పట్టాలు మంజూరు చేయడంలో ఎలాంటి అభ్యంతరాలు లేవని తెలియజేసినప్పటికీ రెవెన్యూ అధికారులు డి పట్టాలు మంజూరు చేయడంలో అలసత్వం వహిస్తున్నారని అన్నారు. వెంటనే గ్రామస్తులకు పట్టాలు ఇచ్చేలా తహశీల్దార్‌ను ఆదేశించాలని కలెక్టర్‌కు వినతిని అందించారు. కార్యక్రమంలో గిరిజన సంఘ సభ్యులు పి.రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రైకార్ పథకాలు గిరిజనులకు అందాలి : చైర్మన్

ప్రజాశక్తి - సీతంపేట

ప్రభుత్వం ద్వారా మంజూరైన ట్రైకార్ పథకాలు గిరిజనులకు అందాలని ట్రైకార్ చైర్మన్ బోరగం శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆయన మండలంలోని బిల్లమడ, మోహన్ కాలనీ గ్రామాల్లో పర్యటించి మారిషస్ పైనాపిల్ రకం పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గిరిజన రైతులతో మాట్లాడుతూ మారిషస్ పైనాపిల్ రకం పంటకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పంట సాగు విధానాన్ని రైతులకు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సోలార్ తాగునీటి ట్యాంకు సౌకర్యం కల్పించాలని కోరగా, మంజూరుకు చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. కొండచీపుర్లను మార్కెటింగ్ చేసేందుకు ఐటిడిఎ ద్వారా ఓపెన్ మార్కెట్ సౌకర్యం కల్పనకు చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం పులిపుట్టిలోని గోకులం షెడ్ నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ద్వారా నిర్మించిన ఈ గోకులం షెడ్డును రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గోకులం నిర్మాణానికి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. హడ్డుబంగిలో ఆశ్రమ బాలికల పాఠశాలను పరిశీలించి, 9, 10 తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని అన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు బాగా సన్నద్ధమై మంచి మార్కులతో ఉత్తీర్ణులు అవ్వాలని ఆకాంక్షించారు. అనంతరం సీతంపేట, ఐటిడిఎ ద్వారా సీతంపేట వైటిసిలో నిర్వహిస్తున్న గర్భిణీల వసతి గృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు అక్కడ అందుతున్న పోషకాహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని, ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కును పరిశీలించి, పర్యాటక అందాలను తిలకించారు. అడ్వెంచర్ పార్కులో 5 డి థియేటర్లో సినిమా చూసి అద్భుతంగా ఉందని కొనియాడారు. ఈ సందర్భంగా పార్కులో మత్స్య శాఖ ద్వారా చేప పిల్లలను విడిచిపెట్టారు.

అనంతరం ఐటిడిఎలో సెక్టోరియల్ అధికారులతో ప్రాజెక్ట్ అధికారి సమక్షంలో ప్రభుత్వ పథకాలపై సమీక్ష నిర్వహించారు. సమీక్ష సందర్భంగా ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఐటిడిఎ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పథకాల గురించి వివరించారు. వివిధ శాఖల ద్వారా చేపడుతున్న నిర్మాణ పనుల ప్రగతిని తెలిపారు. నిర్మాణంలో ఉన్న గోకులం షెడ్లను ఫిబ్రవరి నెలాఖరుకు పూర్తి చేస్తామని అన్నారు. పెండింగులో ఉన్న అటవీ పట్టాల పంపిణీని పూర్తి చేస్తామన్నారు. రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకొంటున్నామని వివరించారు. ఈ సందర్భంగా ట్రైకార్ చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా మంజూరైన పథకాలు గిరిజనులకు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గోకులం నిర్మాణాలను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వైటీసీల్లో శిక్షణలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి గిరిజన కుటుంబం సోలార్ విద్యుత్ వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. హార్టికల్చర్‌కు సంబంధించిన పంటలను గిరిజనులకు ఎక్కువ అవగాహన ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆదాయం ఎక్కువగా వచ్చే పంటలపై దృష్టి సారించాలని అన్నారు. అటవీ పట్టాలు పంపిణీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో ట్రైకార్ డైరెక్టర్లు పువ్వల లావణ్య, కె.కృష్ణారావు, ఐటిడిఎ అధికారులు ఇఇ రమాదేవి, డిడి అన్నదొర, పిహెచ్‌ఒ వెంకట గణేష్, ఎఒ సునీల్, పశుసంవర్ధక శాఖ ఎడి శ్రీనివాసరావు, మత్స్యశాఖ ఎడిలు సంతోష్, గోపికృష్ణ, ఉపాధిహామీ ఏపీడీ శ్రీహరిరావు, వెలుగు డిపిఎం రమణ, ఎటిడబ్ల్యుఒ మంగవేణి, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు రుణాలు ఇప్పించండి

నిరుద్యోగులకు, నిరుపేద రైతులకు, ఆదివాసీ ప్రజల కు ట్రైకారు రుణాలు ఇవ్వాలని రాష్ట్ర ట్రైకారు చైర్మన్ బోరగం శ్రీనివాసులుకు ఆదివాసీ జెఎసి సీతంపేట కమిటీ వినతిని అందజేసింది. చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో జెఎసి అధ్యక్షులు బిడ్డిక శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సవర చిరంజీవిలు, కార్యదర్శులు బిడ్డిక ఉమామహేశ్వరరావు, బిడ్డక రామ్మోహనరావు, కొండగొర్రి భాస్కరరావు, కూరంగి లావరాజు, నిమ్మక రమేష్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులతో మాట్లాడుతున్న ట్రైకార్ చైర్మన్ శ్రీనివాసులు



విఒఎల దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు నాయకులు మన్మధరావు

విఒఎల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ వద్ద సామూహిక దీక్ష

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లాలో గల విఒఎలు సోమవారం కలెక్టరేట్ ఎదుట మూడు రోజుల పాటు దీక్షలు ప్రారంభించారు. విఒఎల సంఘం నాయకులు రెడ్డి శ్రీదేవి ఆధ్వర్యాన నిర్వహించిన దీక్షలను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు ప్రారంభించారు. విఒఎ సంఘం నాయకులు కె.ధర్మరాజు, మన్మధరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విఒఎలకు ఇచ్చిన హామీ అమలు చేయాలని, ఏడు నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మూడేళ్ల కాల పరిమితి జీవోను అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని చెప్పారని, జీవోను రద్దు చేయాలని కోరారు. కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెల్‌ఫోన్ రీఛార్జి చేయాలని, పని ఒత్తిడి తగ్గించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, తొలగించిన విఒఎలను విధుల్లో చేర్చుకోవాలని కోరారు. చిరుద్యోగులైన విఒఎలపై కూటమి ప్రభుత్వం రాజకీయ వేధింపులకు దిగడం మంచిది కాదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేసి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు సామూహిక దీక్షలు జిల్లాలో మూడు రోజులు పాటు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు ఆలోచించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. సామూహిక దీక్షలకు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, సిపిఎం రాష్ట్ర నాయకులు రెడ్డి వేణు, కొల్లి సాంబమూర్తి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.ఇందిర, సిఐటియు అధ్యక్షులు దావాల రమణారావు, కోశాధికారి గొర్లి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

అటవీ ఉత్పత్తుల కొనుగోలు

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేటలో సోమవారం జరిగిన సంతలో సీతంపేట, పాతపట్నం గిరిజన సహకార సంస్థ బ్రాంచ్ మేనేజర్‌లు దాసరి కృష్ణ, గొర్ల నరసింహులు గిరిజన ఉత్పత్తులను ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన కొండచిపూరులో ఏ గ్రేడ్ 45 రూపాయలు, కేజీ నల్ల జీడిపెక్కలు 22 రూపాయలు చొప్పున కొనుగోలు చేశామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు ప్రతి సంతలో కొనుగోలు చేస్తామన్నారు. సంతలో గిరిజనుల వద్దకెళ్లి అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేస్తామని గిరిజనులకు భరోసా ఇచ్చారు. అనంతరం సంతలో ధరల పట్టిక ప్రదర్శించారు. కాటా వేసి ఉత్పత్తులను కొనుగోలు చేస్తామని గిరిజనులకు తన సిబ్బందితో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సేల్స్ మాన్‌లు దుర్గారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న డ్వాక్రా మహిళలు

వెలుగు సిసిని సస్పెండ్ చేయాలి

- విఒఎలపై రాజకీయ వేధింపులు ఆపాలి
- రావికోన పంచాయతీకి విఒఎను నియమించాలి
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి గంగునాయుడు

ప్రజాశక్తి - పార్వతీపురం

డ్వాక్రా మహిళా సంఘాల, గ్రామైక సంఘాల ఆధ్వర్యంలో ఎన్నుకునే విఒఎల్లో రాజకీయ కక్షపూరిత చర్యలు ఆపాలని గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ వద్ద డ్వాక్రా మహిళలు ఆందోళన చేపట్టారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం వ్యసాయ కార్మికసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ పార్వతీపురం మండలం రావికోన పంచాయతీ, చొక్కాపువానివలస పంచాయతీ సంగంవలసలో గల కొన్ని గ్రామాలను కలుపుకొని అడ్డూరువలసలో వెలుగు సిసి పంటల సతీష్ ఆధ్వర్యంలో విఒఎ ఎన్నికలు నిర్వహించారని తెలిపారు. ఈ ఎన్నికలకు 43 సంఘాలు ఉన్నప్పటికీ 39 సంఘాలు హాజరయ్యాయని,ముఖ్యంగా గిరిజన డ్వాక్రా మహిళా సంఘాలు అత్యధికంగా ఉన్నందున గిరిజన మహిళనే ఎన్నుకునే హక్కు సంఘ సభ్యులకు ఉన్నప్పటికీ కేవలం రాజకీయ కక్ష సాధింపులతో అధికార టిడిపి అనుయాయులను నియమిస్తామని సిసి సతీష్ తెలిపడం దారుణమని మండిపడ్డారు. మినిట్స్ బుక్ ఆధారంగా సిసి మొదటగా ప్రతిపాదించే పది ఎజెండాల్లో కేవలం తొమ్మిది ఎజెండాలు మాత్రమే సభ్యులకు తెలియజేశారని, పదో ఎజెండా ఎందుకు ఖాళీ వదిలారని సంఘ సభ్యులు ప్రశ్నించగా ఏమీ తెలియదన్నట్టు మాటను దాట వేశారని తెలిపారు. ఏది ఏదైనా మొదటగా విఒఎ ఎన్నిక నిర్వహించిన అనంతరమే, తదుపరి ఎజెండా ప్రక్రియ చేపట్టాలని సంఘ సభ్యులంతా పట్టుబడడంతో, ఎన్నికల సమయం ఇది కాదని, పాత బకాయిలు వసూలు మేరకు మాత్రమే ఈ సమావేశమని సతీష్ చెప్పడంతో ఒక్కసారిగా మహిళలంతా ఎదురు తిరగడంతో అక్కడ నుండి సతీష్ వెళ్లిపోయారని సంఘ సభ్యులు తెలిపినట్టు గంగునాయుడు అన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించామన్నారు. ఇప్పటికే రాజకీయ కుట్రలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో నియమించిన విఒఎను అక్రమంగా తొలగించి, మధ్యంతరంగా నేటి ప్రభుత్వ అనుకూలులను పక్కా ప్రణాళికతో నియమించేలా చర్య చేపట్టడం దుర్మార్గమని అన్నారు. పంచాయతీ ప్రజా ప్రతినిధి కద్రక రామస్వామి లేని సమయం చూసుకొని ఈ ఎన్నికలు నిర్వహించడం వెనుక రాజకీయ కుట్రలో భాగమేనన్నారు. గతంలోనే సీసీపై చర్యలు చేపట్టాలని గిరిజనుల ఫిర్యాదు మేరకు అప్పటి కలెక్టర్ సస్పెండ్ చేయాలని ఆదేశాలు ఇచ్చినా, దాన్ని ససేమీరా చేసి, నేడు మళ్లీ అతన్ని అదే ఎన్నికలకు నియమించడం అన్యాయమని అన్నారు. తక్షమే వెంటనే విఒఎ ఎన్నిక ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాలని, ఎన్నిక ప్రక్రియకు విరుద్ధంగా ప్రవర్తించి, రాజకీయ పిలుపులకు లోబడి విధులు నిర్వర్తిస్తున్న వెలుగు సిసి సతీష్‌ను సస్పెండ్ చేయాలని, అధికారులపై రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, గిరిజన సంఘం నాయకులు హెచ్.లక్ష్మణరావు, డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు, గ్రామైక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యా కమిషనర్ తీరు మార్చుకోవాలి

ప్రజాశక్తి- పార్వతీపురం

పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు తీరు మార్చుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులపై క్రిమినల్ కేసులు పెడతామని పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు చెప్పడం సరైంది కాదన్నారు. పాఠశాలల్లో కొంతమంది ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్య విషయంలో తప్పుడు లెక్కలు చూపుతున్నారనడం ఉపాధ్యాయులను అవమానించడమేనని చెప్పారు. గతంలో పాఠశాల కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ ఇదే ధోరణితో వ్యవహరించారని, ఇప్పుడున్న కమిషనర్ విజయరామరాజు తీరు మార్చుకోకపోతే అలాంటి గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

ఆర్‌ఐ వెంకటేష్ బదిలీ

ప్రజాశక్తి- సీతంపేట

మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేష్‌కు పాలకొండ సబ్ కలెక్టర్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ గా బదిలీ అయ్యింది. వీరఘట్టం మండలం టైపిస్టుగా పనిచేస్తున్న వి.విజయ గణేష్‌కు సీతంపేట ఆర్‌ఐగా ఉద్యోగోన్నతిపై బదిలీ అయినట్టు తహశీల్దార్ పి.అప్పలరాజు తెలిపారు. ఆర్‌ఐ ఎస్ వెంకటేష్ మూడున్నరేళ్లగా గిరిజనులకు అనేక సేవలు అందించారు.

9న ఐద్వా సదస్సు

ప్రజాశక్తి - పాలకొండ

మహిళలపై అత్యాచారాలు, హత్యలపై ఫిబ్రవరి 9న జరగనున్న సదస్సును జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి పిలుపునిచ్చారు. ఈ మేరకు సదస్సుకు సంబంధించిన కరపత్రాలను సోమవారం స్థానిక నగర పంచాయతీ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. ఫిబ్రవరి 9న స్థానిక వావిలి తిరుమల కళ్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు ఈ సదస్సు జరుగుతుందని, కావున ప్రతి ఒక్కరూ హాజరు కావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు పి.రాధ, శ్రీదేవి, పి.విమల, బి.అమరవేణి, జెస్సీబాయ్, రజని, పద్మావతి, శారద, రేయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒకు కౌన్సిలర్ల వినతి

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీని శిర్లకుంగాలా పట్టి పీడిస్తున్న డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం పార్వతీపురంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలతకు కౌన్సిలర్లు వినతిని అందజేశారు. పాలకొండ దగ్గర డంపింగ్ యార్డ్‌కు స్థలం కేటాయిస్తే అక్కడ టిడిపి నాయకులు అడ్డుకున్నారని, సింగన్నవలస వద్ద గల ప్రభుత్వ పోరంబోకును కేటాయిస్తే ఆ గ్రామస్తులతో పాటు చుట్టుపక్క గ్రామాల ప్రజలు అడ్డుకుంటున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు కోరారు. ఇందుకు డిఆర్‌ఒ స్పందిస్తూ ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. వినతిని అందజేసిన వారిలో కౌన్సిలర్లు వెలమల మన్మధరావు, దుప్పాడ పాపినాయుడు, కడగల రమణ, కొంచాడ అరుణ, బాసూరు కాంతారావు, కోడం విజయకుమార్, పల్లా భాను, తుమ్మగుంట శంకర్రావు, తూముల లక్ష్మణరావు, దుంపల చిన్ని తదితరులు ఉన్నారు.

జాతర ప్రతిష్టను పెంచేందుకు కృషి

ప్రజాశక్తి - మక్కువ

గిరిజన జాతరగా మార్పు చెందిన పోలమాంబ అమ్మవారి ప్రతిష్టను మరింతగా పెంచేందుకు తమ వంతు కృషి చేస్తామని ఉత్సవ కమిటీ చైర్మన్ నైరన తిరుపతిరావు, యువజన నాయకులు లీడర్ నైరన సూర్య యాదవ్ తెలిపారు. తమ సొంత నిధులతో ఉచితంగా భక్తుల సౌకర్యార్థం బోరు బావిని ఏర్పాటు చేశామన్నారు. రానున్న మారు జాతర అనంతరం ప్రముఖులను కూడా పోలమాంబ సన్నిధికి తీసుకొచ్చామని, వారి ద్వారా అమ్మవారి ప్రతిష్ఠ మరింత ప్రాచుర్యం పొందేలా చర్యలు చేపడతామని తెలిపారు. మంత్రి సంధ్యారాణి సహాయ సహకారాలతో ఆలయాల అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. మంగళవారం అమ్మవారికి ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించేందుకు గ్రామంలోకి వస్తున్న మంత్రి సంధ్యారాణికి ఘన స్వాగతం పలకడం జరుగుతుందన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు మెడికల్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో ఉన్న అంగనవాడి కేంద్రాలకు ఐసిడిఎస్ పిఒ కె. విజయగౌరి సోమవారం మెడికల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఉన్న 316 అంగన్వాడీ సెంటర్లకు సంబంధించిన కిట్లను వర్కర్లకు అందించామన్నారు. ఇందులో ప్రాథమిక చికిత్స, బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు ఉపయోగపడేవి సామగ్రి ఉందన్నారు. వాటిని ఉపయోగించే విధానంపై అవగాహన కల్పించడంతో పాటు గ్రామస్తులతో అంగన్వాడీ కేంద్రాల్లో మెడికల్ కిట్లు అందుబాటులో ఉన్నాయని గ్రామస్తులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

'మందకృష్ణకు పద్మశ్రీ ఇవ్వడం సిగ్గుచేటు'

ప్రజాశక్తి - సాలూరు

ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగని పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేయడం రాజ్యాంగ విరుద్ధమని రిపబ్లికన్ పార్టీ నాయకులు గొంప ప్రకాశరావు ఒక ప్రకటనలో చెప్పారు. రాజ్యాంగాన్ని అవమానించినందుకు, మాలలను అణగదొక్కాలని చూస్తున్నందుకు మందకృష్ణకు పద్మశ్రీ ఇవ్వడం దారుణమన్నారు. ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు సిఫార్సు మేరకే మందకృష్ణను పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేశారని ఆరోపించారు. తెలుగు రాష్ట్రాల్లో వున్న మాలలు ఎన్‌డిఎ కూటమి పార్టీలకు తగిన సమయంలో బుద్ధి చెపుతారని హెచ్చరించారు.

29న ఆధార్ ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఆధార్ కార్డులో తప్పులు, ఒప్పులు సవరణల కోసం ఈ నెల 29న గుమ్మలక్ష్మీపురం పోస్ట్ ఆఫీస్ కార్యాలయంలో ఆధార్ ప్రత్యేక సవరణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పోస్ట్ ఆఫీస్ సిబ్బంది తెలిపారు. ఈ ఆధార్ ప్రత్యేక క్యాంపును పార్వతీపురం మన్యం జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.బాబురావు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ మేరకు ఆధార్‌లో తప్పులున్నాసరే, సవరణలు గాని చేయాలనుకునే వారు ఈ ప్రత్యేక శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. చిన్న పిల్లల నుండి పెద్దల వరకు ఎవరైనా తమ ఆధార్ కార్డుల సవరణకు ఈ ప్రత్యేక ఆధార్ శిబిరాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.

రెండు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని సుమిత్రాపురం, పెదఅంకలాం గ్రామాలలో పశు వైద్య శిబిరాలను పశువైద్యాధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి బలగ రమణమ్మ, రౌతు వేణుగోపాల్ నాయుడు మాట్లాడుతూ పాడి పశువుల రైతులు గ్రామాల్లో జరిగే పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పశువైద్యాధికారులు మాట్లాడుతూ ఈ శిబిరాలలో పశువులకు టీకాలు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొత్స నందిని, ఉమామహేశ్వరరావు, పశువైద్య ఎడి సిహెచ్ దేవీకుమార్, మండల వైద్యాధికారి ఎస్ రామారావు, పశువైద్య సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

మేట్ల నియామకంలో రాజకీయ జోక్యం తగదు

ప్రజాశక్తి - సీతానగరం

ఉపాధి హామీ పనుల్లో పాతమేట్లనే కొనసాగించాలని, మెట్ల నియామకంలో రాజకీయ జోక్యాన్ని అరికట్టి, వేతన దారులు కోరుకున్న వారిని మేట్ గా నియమించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద వేతనదారులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని నిడగల్లులో మేట్ల నియామకంలో రాజకీయ జోక్యం జరుగుతుందన్నారు. అలాగే ఈ పనుల్లో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు సిఐటియు మండల కార్యదర్శి జి.వెంకటరమణ మద్దతు తెలిపారు. ధర్నాలో ఉపాధి కూలీలు నక్క త్రినాధ, ఆదిని నాయుడు, తవిటమ్మ, జానకి, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ద్వారపురెడ్డిని పరామర్శించిన వైసిపి నేతలు

ప్రజాశక్తి - పార్వతీపురం

మాతృవియోగంతో బాధపడుతున్న మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, కర్షకమహర్షి ఆసుపత్రి అధినేత డాక్టర్ ద్వారపురెడ్డి రామ్మోహన్‌రావును సోమవారం వైసిపి జిల్లా అగ్రనేతలు పరామర్శించారు. ఇటీవల ద్వారపురెడ్డి సోదరుల తల్లి సావిత్రమ్మ మృతి చెందారు. ఈ మేరకు మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే ఎ.జోగారావు పార్వతీపురంలో ద్వారపురెడ్డి నివాసానికి వెళ్లి సావిత్రమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ద్వారపురెడ్డి జగదీష్, రామ్మోహన్ రావును ఓదార్చారు.

పిజిఆర్ఎస్‌లో వినతులు స్వీకరిస్తాం

ప్రజాశక్తి - కురుపాం

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులు స్వీకరిస్తామని ఎంపిడిఒ జె. ఉమామహేశ్వరి అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద వ ప్రజల సమస్యలపై వినతులు అందిస్తే స్వీకరిస్తామని అన్నారు. మండల వ్యాప్తంగా పరిష్కరించాల్సిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని, లేనిచో ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి సమస్య పరిష్కారమయ్యేలా చేస్తామని అన్నారు. కావున మండల ప్రజలు ఈ విషయాన్ని గమనించి ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

లబ్ధిదారుల పేర్లు నమోదు చేయండి

ప్రజాశక్తి - పాలకొండ

హౌసింగ్ లబ్ధిదారుల పేర్లను సకాలంలో ఆన్లైన్ నమోదు చేయాలని నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అన్నారు. సోమవారం నగర పంచాయతీ కార్యాలయంలో సచివాలయాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థలాలు ఉండి ఇంటి రుణం కోసం దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు వెంటనే నమోదు చేయాలన్నారు. వారి దగ్గర నుంచి పొజిషన్ సర్టిఫికెట్లు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు హౌసింగ్ ఎఇ మాధవరావు ఉన్నారు.

ఏ పనీ చేయకపోతే ఎలా?

ప్రజాశక్తి- వీరఘట్టం

'మీరు ఏ పనీ చేయటం లేదని, గ్రామస్థాయిలో మీపై ఫిర్యాదులు వస్తున్నాయి. ఏ పనీ చేయకపోతే ఎలా?' అని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఐసిడిఎస్ పిఒ బి.సిమ్మలమ్మపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎన్ని అంగన్వాడి కేంద్రాలు ఉన్నాయి. సొంత భవనాలు ఎన్ని ఉన్నాయి. అద్దె భవనాలు ఎన్ని ఉన్నాయని పిఒని ప్రశ్నించగా ఆమె నుండి సరైన సమాధానం రాకపోవడంతో ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. సొంత భవనాలు నిర్మించేందుకు స్థలాలు ఉన్నాయా? ఎక్కడెక్కడ ఉన్నాయి? ఎక్కడ లేవు? గుర్తించారా? అని ప్రశ్నించారు. వీటిపై పిఒ పూర్తి సమాచారం చెప్పకపోవడంతో సమాచారం లేనప్పుడు సమావేశానికి ఎందుకు వస్తారు? మీతో నాకు తలనొప్పిగా ఉందని ఆగ్రహించారు. సగంలో ఆగిన భవనాలు ఎన్ని, పూర్తయిన భవనాలు ఎన్ని, స్థలాలు లేవని చెప్పిన గ్రామాలు ఎన్ని, వాటి లిస్టులు తయారు చేసి తమకు అందజేయాలని పిఒను ఆదేశించారు. పాలు, గుడ్లు సరిగ్గా అంగన్వాడి కేంద్రాలకు సప్లయ్ చేయటం లేదని, ఫిర్యాదులు వస్తున్నాయని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని ఎన్ని అంగన్వాడి కేంద్రాలకు మరుగుదొడ్లు నిర్మించారు, వాటి విలువ ఎంత? డ్రింకింగ్ వాటర్‌కు ఎంత? రంగులు వేయటానికి ఎంత ఖర్చు చేశారని ఎమ్మెల్యే పిఒను ప్రశ్నించగా ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ డి. కావ్య మాట్లాడుతూ మండలంలోని 33 అంగన్వాడి కేంద్రాలకు డ్రింకింగ్ వాటర్‌కు, రూ.17వేలు రంగులు వేయటానికి, రూ.16వేలు నిధులు మంజూరు చేశామన్నారు. తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సు కార్యక్రమాలు నిర్వహించి వివిధ భూ సమస్యలపై 200 దరఖాస్తులు

ఐసిడిఎస్ పిఒపై ఎమ్మెల్యే ఆగ్రహం



పిఒను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

స్వీకరించామన్నారు. వాటిని ఆన్‌లైన్ చేయడంతో పాటు ఇప్పటి వరకు 70 దరఖాస్తులకు సంబంధించి సమస్య పరిష్కరించామన్నారు. మిగిలిన 130 దరఖాస్తులకు నెల రోజుల్లో పూర్తి చేస్తామని వివరణ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో శ్మశానవాటికలు ఆక్రమణలకు గురయ్యాయని, వాటిని పూర్తిస్థాయిలో పరిశీలన జరిపి గతంలో వాటికి కేటాయించిన స్థలం ఎంత? ప్రస్తుతం ఉన్న స్థలం ఎంత? పూర్తి నివేదిక ఇవ్వాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. ఉద్యానవన శాఖకు సంబంధించి ఎఒ టి.అమరేశ్వరి మాట్లాడుతూ డ్రిప్పు ఇరిగేషన్‌కి సంబంధించి రైతులు రైతు కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వీరఘట్టంకు చెందిన కోట సంతోష్ 2019-20 ఆర్థిక సంవత్సరంలో ఎకరా విస్తీర్ణంలో రూ2.5 లక్షలతో దొండ పందిరి వేశానని వాటికి సంబంధించి ఇంతవరకు నిధులు అందలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కూరగాయల రైతులకు ఏ విధమైన ఇబ్బందులూ లేకుండా చూడాలని, ఎమ్మెల్యే ఎఒని ఆదేశించారు. రహదారులు, సీసీ రోడ్లు, మురికి కాలువలు, మరుగుదొడ్లు పనులు మార్చి ఒకటో తేదీ నాటికి పూర్తి చేసేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ, ఎఎంసి మాజీ చైర్మన్ పి కృష్ణమూర్తి నాయుడు, మండల అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్, పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, నీటి సంఘం మాజీ అధ్యక్షులు బల్ల హరిబాబు, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి జనసేన జానీ, పట్టణ అధ్యక్షులు ఎస్ అచ్యుతరావు అధికారులు పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి

తమ వీధికి వెళ్లేందుకు దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రహదారి సౌకర్యం కల్పించాలని మండల కేంద్రంలోని ఎల్లంకి వీధికి చెందిన మహిళలు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం వినతి పత్రం ఇచ్చారు. ప్రధాన రహదారి విస్తీర్ణ పనుల్లో భాగంగా రహదారికి ఇరువైపులా మురుకు కాలువలు నిర్మించడంతో గృహాలకు చేరుకునేందుకు రహదారి మార్గం లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. వీధిలో ఓ వ్యక్తి మృతి చెందిన సమయంలో పాడిని తీసుకెళ్ళేందుకు కూడా అవస్థలు పడవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వీధిలో మరో ఇద్దరు అస్వస్థకు గురయ్యారని, సరైన రహదారి సౌకర్యం లేక వారిని వైద్యం కోసం బయటికి తీసుకెళ్లలేక గృహాల వద్దనే వైద్యం చేయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, ఈ విషయమై పలుమార్లు అధికారుల వద్ద విన్నవించినా పట్టించుకోలేదని, తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

భవిష్యత్తును ఉజ్వలంగా మార్చుకోవాలి

కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి - కురుపాం

నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించే జాబ్ మేళాలో ఉద్యోగాలు పొందే యువత, వారి భవిష్యత్తును ఉజ్వలంగా మార్చుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంకల్ప్ మెగా జాబ్ మేళా కార్యక్రమం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ మెగా జాబ్ మేళాకు 282 మంది నిరుద్యోగ యువత ఇంటర్వ్యూలకు హాజరుకాగా, అందులో 68 మంది 24 కంపెనీలకు ఎంపికయ్యారు. పిఎం ఇంటర్న్‌షిప్ కింద శిక్షణ పొందిన 30 మంది నిరుద్యోగ యువతకు కలెక్టర్, ప్రభుత్వ విప్‌తో కలిసి సర్టిఫికేట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ కంపెనీలలో ఉద్యోగాలు పొందిన యువతకు, శిక్షణ పొందిన యువతకు ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గంలో ఇటువంటి జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగం పొందిన యువత చిన్న, పెద్ద ఉద్యోగాలనే



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

తారతమ్యం లేకుండా చిత్తశుద్ధి, క్రమశిక్షణతో పనిచేయాలని హితవు పలికారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని, వారి భవిష్యత్తును ఉజ్వలంగా మార్చుకోవాలని తెలిపారు. తద్వారా ఉన్నత స్థానాలకు చేరుకోగలుగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యేతో కలిసి వీడీవీకెల ద్వారా కుట్టు శిక్షణ పొందిన మహిళలకు కుట్టుమిషన్లను కలెక్టర్ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జిల్లాలోని నిరుద్యోగ యువత కోసం మరిన్ని జాబ్ మేళాలు నిర్వహిస్తామన్నారు. నిరుద్యోగ యువత వాటిని సద్వినియోగం చేసుకోవాలని, అవకాశాలను అందిపుచ్చుకోవడంతో పాటు భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య, ప్రిన్సిపాల్ కె. ఉషారాణి, ప్రజా ప్రతినిధులు, నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జూనియర్ కళాశాల సిబ్బంది, నిరుద్యోగ యువత, వివిధ కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మిడి గెడ్డను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే

గుమ్మిడి గెడ్డను సోమవారం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, నీటి పారుదల శాఖ అధికారులు పరిశీలించారు. కొంత దూరం బుల్లెట్ పై మరి కొంత దూరం నడుచుకుని వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా పాడైయిపోయిన అక్విడేక్టర్ తలుపు పరిశీలించారు. వెంటనే మరమత్తులు చేపట్టాలని డిడిఇఇ రవికుమార్‌ను ఆదేశించారు. గుమ్మిడిగెడ్డ చెక్‌డ్యామ్ పరిశీలించారు. ఈ ప్రాంతంలో మినీ రిజర్వాయర్ చేపట్టాలని రైతులు, నాయకులు కోరారు.

గెడ్డ ఆక్రమణ అడ్డగింత

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని వెంకంపేట పంచాయతీ అధికారుల కాలనీ వెనుక ఉన్న, పార్వతీపురం విశాఖపట్నం రాష్ట్ర రహదారి పక్కనే ఉన్న వెంకమ్మ చెరువు వాలు కాలువ గెడ్డ స్థలాన్ని గుర్తు తెలియని కొందరు యంత్రాలతో చదును చేసి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తుండగా, స్పందించిన స్థానికులు వారిని అడ్డుకొని గ్రామ రెవెన్యూ అధికారి ఆచారికి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన విషయాన్ని తహశీల్దార్ జయలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఆమె సిబ్బందిని పంపించి యంత్రాలను నిలుపుదల చేయించి, స్థలానికి సంబంధించిన పత్రాలు తహశీల్దార్ కార్యాలయంలో చూపించాలని, సర్వే నిర్వహించి ఆ స్థలం ఎవరిదనే విషయాన్ని నిర్ధారిస్తామని తెలిపారు. దీంతో ఆక్రమణదారులు వెనుతిరిగారు.

పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమానికి అవసరమైన పుస్తకాలను వాలంటీర్లకు ఎంపిపి ఉరిటి రామారావు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపిపి మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వాలంటీర్లు తమవంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.పైడితల్లి, స్థానిక సర్పంచ్ కలిశెట్టి ఇందుమతి, ఎపిఎం పెదిరెడ్ల అప్పలనాయుడు, సిసిలు చందాన తిరుపతిరావు, బొంగు రామినాయుడు, వి.లక్ష్మణరావు, టి.చంద్రమోహన్, కోటిపల్లి దాసు, కొప్పర రమేష్, విఒఎలు వావిలిపల్లి స్వాతి, ఇజ్జురోతు గౌరి, గొట్టాపు జ్యోతి, పాల్గొన్నారు.

టిక్కబాయిలో స్కూల్ కాంప్లెక్స్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని టిక్కబాయి స్కూల్ కాంప్లెక్స్ క్లస్టర్ పరిధిలో ఉన్న పాఠశాలల ఉపాధ్యాయులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా పాఠశాలల హాబిటేషన్, పాఠశాల సమగ్ర అభివృద్ధిపై టిక్కబాయి ప్రధానోపాధ్యాయులు జ్ఞాన ప్రకాష్ చర్చించి వివరించారు. డిఆర్‌పిలు దేవానంద్, సింహాచలం, సిఆర్‌పి కాంతారావు పాల్గొన్నారు.

అర్జీలను చిత్తశుద్ధితో పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వచ్చిన వినతులను ఎప్పటికప్పుడు పరిశీలించి, ఆ సమస్య పరిష్కార దిశగా కృషి చేయాలని అన్నారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తెలిపారు. మొక్కుబడిగా అర్జీలు పరిష్కరించి, మళ్లీ రీఓపెన్ అయ్యే పరిస్థితి ఉండరాదని, ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలకు అనుగుణంగా పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. అధికారులు చూపిన పరిష్కారంతో అర్జీదారుడు సంతృప్తి చెందాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్ కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 105 వినతులను కలెక్టర్ స్వీకరించి, సమస్యలను సావధానంగా విని, తదుపరి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ కె.హేమలత, కెఆర్ఆర్సి ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ కె.చలపతిరావు, పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వికలాంగునికి ట్రై సైకిల్‌ను పంపిణీ చేసిన కలెక్టర్

జిల్లా ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ఎంతో మంది లబ్ధిపొందుతున్నారు. ఇందులో భాగంగా సీతానగరం మండలం కోటసీతారాంపురం గ్రామానికి చెందిన సీతారాములు (80), తాను వికలాంగుడునని, నడవలేనందున తనకు ట్రై సైకిల్‌ను మంజూరు చేయాలని కలెక్టర్‌కు అర్జీని అందజేశారు. అర్జీదారుని సమస్యను సావధానంగా అడిగి తెలుసుకున్న కలెక్టర్ తక్షణమే ట్రైసైకిల్‌ను మంజూరు చేసి, లబ్ధిదారునికి అందజేశారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ అధికార ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలి

పార్వతీపురంరూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా ఎస్‌పి ఎస్‌వి మాధవ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో డిసిఆర్‌బి హెచ్‌సి తాతబాబు పాల్గొన్నారు.

ఐటిడిఎ గ్రీవెన్స్‌కు 65 వినతులు

సీతంపేట: స్థానిక ఐటిడిఎ ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ 65 వినతులు వచ్చాయి. సోమవారం ఐటిడిఎలో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. బొడ్డగూడకు చెందిన అప్పలనాయుడు తాగునీరు రహదారి సౌకర్యం కల్పించాలని, బీరపాడు చెందిన ధర్మారావు తాగునీరు మినీ ట్యాంక్ ఏర్పాటు చేయాలని, గజిలికి చెందిన సువార్త కమ్యూనిటీ హాల్ పనులు పూర్తి చేయాలని కోరారు. బిడ్డిక వెంకటేష్ మోహన్ కాలనీకి సిసి రోడ్డు మంజూరు చేయాలని, తాడిపాయి చెందిన బంగారు జలజీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో ఎపిఒ చినబాబు, డిడి అన్నదొర, డిప్యూటీ ఇఒ రవి ప్రసన్నకుమార్, సిడిపిఒ రంగలక్ష్మి, పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. పెండింగ్ ఉన్న పనులు త్వరతగతిన పూర్తి చేసి పాఠశాలను వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కొండయ్య, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు, మాజీ ఎఎంసి చైర్మన్ కోలా రంజిత్, కూటమి నాయకులు వెంపటాపు భారతమ్మ, రమణమూర్తి, రామకృష్ణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

భారత్ గ్యాస్ వినియోగదారులకు ఇక్కట్లు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

భారత్ గ్యాస్ కోసం వినియోగదారులు నెల రోజుల నుంచి ఇండెంట్ పెట్టుకున్నప్పటికీ గ్యాస్‌బండలు తమ ఇళ్లకు రాకపోవడంతో తీవ్ర అవస్థలుపడుతున్నారు. ఈ మేరకు పట్టణంలోని సారికివీధి జంక్షన్లో ఉన్న భారత్ గ్యాస్ ఆఫీసు వినియోగదారులు సోమవారం చేరుకొని తమ గోడును వెళ్లబుచ్చుకొనేందుకు వెళ్లారు. అయితే గ్యాస్ కార్యాలయానికి తాళం వేసి ఉండడంతో వినియోగదారులు అసహనం వ్యక్తం చేశారు. గ్యాస్ ఆఫీస్ బయట ఉన్న ఆఫీసు సిబ్బందిని సమాచారం అడగ్గా అక్కడ ఉన్న డెలివరీ బాయ్‌లు గ్యాస్ బండ తీసుకొని వస్తే గ్యాస్ ఇవ్వడం జరుగుతుందని చెప్పడంతో సంబంధిత వినియోగదారులు ఇళ్లకు వెళ్లి ఖాళీ గ్యాస్ దిమ్మలను తీసుకొచ్చి కొత్తగా పట్టుకెళ్లారు. ఈ సమయంలో ఈ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ విషయంపై సంబంధిత పౌర సరఫరాల అధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.



గ్యాస్ కోసం వచ్చిన వినియోగదారులు

మేట్‌ను కొనసాగించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

సీతానగరం మండలం నిడగల్లుకు చెందిన ఉపాధి హామీ మేట్ కొల్లి ధనలక్ష్మిని కొనసాగించాలని, గ్రూపు సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎపి వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన కొల్లి ధనలక్ష్మి ఇంటర్ చదువుకొని ఉపాధి పని చేసుకుంటూ మేటుగా విధులు నిర్వహిస్తుందన్నారు. అయితే ఇటీవల ఎపిఒ, ఫీల్డ్ అసిస్టెంట్ కుమ్మక్కై, రాజకీయ కక్షతో మేట్‌ను తొలగించి నిరక్షరాలైన వేరొకరికి బాధ్యతలు అప్పగించారని తెలిపారు. దీనివల్ల చదువురాని సూపర్వైజర్‌తో విధులు సక్రమంగా నిర్వహించలేరని, కావున రాజకీయ కక్షలను పక్కనపెట్టి పాత మేట్‌ను కొనసాగించాలని కలెక్టర్‌ను, అధికారులను కోరారు. కార్యక్రమంలో నిడగల్లు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కూలీలు

ఆధార్ కేంద్రాలు పనిచేసేలా చూడాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రభుత్వం నిర్దేశించిన వార్డు సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు పనిచేసేలా చర్యలు చేపట్టాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిఆర్ఒ కె.హేమలతకు పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లివెంకటరమణ వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణంలోని 27,29 వార్డుల కుసుమగుడ్డివీధి జంక్షన్, తాళ్లబత్తులవీధి సచివాలయాల్లో ఉచిత ఆధార్ కేంద్రాలు సుమారు 11 నెలలుగా పనిచేయడం లేదన్నారు. దీనివల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆధార్ కార్డుల్లో తప్పులను సరి చేసుకొనేందుకు, ఫోన్ నెంబర్ లింకింగ్, నవజాత శిశువులు కొత్తగా ఆధార్ కార్డు నమోదు సేవలు నిమిత్తం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కావున ప్రభుత్వ ఆధార్ కేంద్రాలు పనిచేసేలా కృషి చేయాలని కోరారు. దీనికి డిఆర్ఒ స్పందిస్తూ సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో అంబేద్కర్ ఫోటోని చేతపట్టి విద్యార్థులు ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు మంజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు టి.అఖిల్ మాట్లాడుతూ కులం పేరుతో విద్య, ఆస్తి, ప్రాథమిక హక్కులు కాలరాశారని అన్నారు. ఎస్సి, ఎస్టి, బిసి మహిళా సామాజిక తరగతులకు స్వాతంత్రం అనంతరం భారత రాజ్యాంగం అందరికీ విద్యా హక్కు కల్పించిందన్నారు. ప్రభుత్వ రంగంలో ఉద్యోగ రిజర్వేషన్ కల్పించిందని, చట్టం ముందు అందరూ సమానమేనని చెప్పారు. విద్యార్థులకు విద్య హక్కు చట్టం గురించి అవగాహన కల్పించారు. ప్రాథమిక విద్యను కూడా కేంద్రం తన చేతుల్లోకి తీసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి వేల పాఠశాలలను మూసేయడానికి చంద్రబాబు ప్రభుత్వం సిద్ధమయ్యిందన్నారు. బిజెపి కేంద్ర ప్రభుత్వ నేషనల్ విద్యా విధానంలో భాగమే ఈ కుట్ర అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు దిలీప్, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు సంజీవ్, గౌతమ్, అరుణ్, సుకన్య పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎలక్ట్రికల్ వర్కర్లను ఆదుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జిల్లాలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్లుగా పనిచేస్తున్న వారిని ప్రభుత్వం రుణాలు, ఇళ్ల స్థలాలందించి ఆదుకోవాలని పార్వతీపురం ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.రామచంద్రరావు అన్నారు. జాతీయ ఎలక్ట్రీషియన్స్ డే సందర్భంగా సమాశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో ప్రధాన పాత్ర వహిస్తూ వినియోగదారులకు ఎనలేని సేవలందిస్తున్న ప్రైవేటు ఎలక్ట్రికల్ పనివారికి కనీస ఆదాయం లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వీరి అభివృద్ధికి ప్రభుత్వం చేయూత అందించి ఆదుకోవాలని కోరారు. అనంతరం పార్వతీపురం మార్కెట్ యార్డ్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రైవేట్ ఎలక్ట్రికల్ పనివాళ్లతో పాటు ఆ సంఘం నాయకులు మజ్జి శంకర్రావు, సువ్వాడ కనకరాజు, నల్లి సంగమేశ్వరరావు, బొంతల కోటి రత్నాకరరావు, గొడబ రాజవెంకటరత్నం, పాల్గొన్నారు.

గ్రామాల్లో ఏనుగుల గుంపు సంచారం

కురుపాం: మండలంలోని కిచ్చాడ, వన్నాం గ్రామాల మధ్య ఏనుగుల గుంపు సోమవారం ఉదయం సంచరించింది. ఇప్పటి వరకూ కొమరాడ మండలంలో సంచరించిన ఏనుగుల గుంపు కిచ్చాడ చేరుకుంది. దీంతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పొలాలకు వెళ్లే రైతులు జాగ్రత్తగా వెళ్లాలని అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు. పంటలు ధ్వంసం చేస్తుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగులను గ్రామాలకు దూరంగా తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

యువగళం సంబరాలు

గుమ్మలక్ష్మీపురం: యువ గళం రెండేళ్లు పూర్తి అయిన సందర్భంగా గుమ్మలక్ష్మీపురం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ పాడి సుదర్శన్‌రావు, ఐదు మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.